# నమ్మలేని నిజం

## కోనేరు రాజబాబు

సుజాతకి అన్నీ ఉన్నాయ్- పెళ్లి కావడానికి, లేనిదల్లా కట్నం ఇవ్వగల తాహతు మాత్రమే!

పెరిగే ధరలను చూసి సామాన్య మానవుడు పడే ఆవేదనకు మించి సుజాత పెళ్ళి కానందుకు తల్లి అన్నపూర్ణమ్మ నిత్యం ఆవేదన పడుతూనే వుంది - కానీ ఏం లాభం? భర్త చెప్పులరిగేలా తిరుగుతూనే వున్నాడు. వచ్చిన సంబంధాలు వెనక్కి పోతున్నాయ్- వాళ్ళు మాత్రం ఏం చెయ్యగలరు? సుజాత వున్న ఊళ్ళోనే ఏదో ఆఫీసులో గుమాస్తాగా పని చేస్తోంది. జీతం 1500 వరకూ వస్తుంది. తండ్రి పని చెయ్యలేదు. వున్న కొద్ది పాటి ఆస్తి అప్పుల కింద హరించుకుపోయింది.

ప్రస్తుతం వున్న ఆస్తి ఉద్యోగం వున్న అమ్మాయి మాత్రమే.




అప్పు మాత్రం పెళ్ళి కావలసిన అమ్మాయి.

కోట్లకు పడగలెత్తిన బాబులు కూడ కట్నాలు ఆశించే ఈ రోజుల్లో సుజాత లాంటి పేదింటి ఆడపిల్లలకు పెళ్ళిళ్లు జరగడం సామాన్యమా?

చదువుకునే రోజుల్లో సుజాతనంతా బ్యూటీ క్వీన్ అనే వారు. తోటి స్నేహితురాళ్ళు కొందరు "ఎక్కడున్నాడో కాని ఆ అదృష్టవంతుడు! మాకే నిన్ను కొరుక్కు తినేయ్యాలని పిస్తోంది" అనే వారు. కాల గమనంలో తనకే యిప్పటి వరకూ పెళ్ళి కాలేదు.

పగలల్లా ఆఫీసులో పని చెయ్యడం - ఇంటికి వచ్చాక అమ్మకు వంటలో సాయం చెయ్యడం- ఇదే సుజాత నిత్యకృత్యమైపోయింది.

అమ్మ తన గురించే ఎప్పుడూ ఆలోచిస్తుండేది. ఒంటరిగా వున్నప్పుడు కళ్ళ నీళ్ళు పెట్టుకొనేది. నాన్న ఎప్పుడూ ఇంట్లో వుండేవాడు కాదు. ఎప్పుడూ సంబంధాల కోసం తిరుగుతున్నానని తన దగ్గర పదులూ, పాతికలూ తీసుకుంటూ వుండేవాడు. కానీ ఒక్క సంబంధం కూడ క్రియా రూపం దాల్చేది కాదు.

కొందరు పెళ్లి చూపులకు వచ్చి,' పిల్ల నచ్చింది. వెళ్ళగానే ఉత్తరం వ్రాస్తామనేవారు- నెలలు గడిచినా ఏ జాబూ వచ్చేదికాదు.

కొందరు పెళ్ళి చూపులకు వస్తామని చెప్పి ఎగ్గొట్టే వారు రాకుండా! కొందరైతే పెళ్ళి చూపులకు వచ్చి కరువు తీరా పెట్టిన నన్నీ మెక్కి పిల్ల నచ్చిందనీ, కానీ యిద్దరి జాతకాలూ కలవ లేదని చల్లగా జారుకునేవారు.

ఇవన్నీ చూస్తుంటే సుజాతకు అసహ్యంవేసేది. సృష్టికి మూలమైన స్త్రీజాతిని చులకనగా చూసే ఈ సమాజం మీదే నమ్మకం పోయేది-అలా ఆలోచిస్తూ సుజాత నిద్రలేని రాత్రులెన్నో గడిపేది.

ఉదయం లేస్తే ఆఫీసుకు వెళ్ళాలి - ఆఫీసంటేనే ఆమెకు చిరాకు- కానీ గత్యంతరం లేదు.

"నీకు ఉద్యోగం రావడానికి నేనే కారణం- మినిష్టరు గారి క్యాండిడేట్‌ను కూడ కాదని నీకిచ్చాను ఏదో నొరగబెడతావని- నీకా విశ్వాసం లేదంటాడు" ఆఫీసరుగారు ఆయన దగ్గరకు వెళ్ళి నప్పుడల్లా- పాటికి పదిసార్లు ఆ ఫైలు తెమ్మనీ, ఈ ఫైలు తెమ్మనీ చేతులు నొక్కి సంతోష పడుతుంటాడు 10 మంది పిల్లలున్న హెడ్ క్లార్క్ పాపయ్యగారు- ఇక కొంత మంది గుమాస్తాలైతే, మా ఆవిడ ఇంట్లో లేదనో, షికారుకు రమ్మనో, సినిమాకు రమ్మనో పరోక్షంగా తన గురించి మాట్లాడేవారు -! ఆఫీసులో వున్నంత సేపు ముళ్ళ మీద కూర్చున్నట్టు వుండేది. ఎలాగో ఈ రోజుకు ఆఫీసు పీడ వదిలిందనుకుంటే సిటీ బస్సులో అనుకొని నిలబడే వాళ్ళు-కుదుపులు వచ్చినప్పుడు కావాలని మీద పడే వాళ్ళు కొందరు - బస్సు దిగిన తరువాత ఇంటి వరకు సాగనంపుతూ 'నీ దయరాదా' అంటూ పదాలు పాడే రోమియోలు కొందరు. ఇలాంటి భద్రత లేని జీవితం ఇంకెన్నాళ్ళో? ఇనే ఆలోచనలతో సుజాత నిద్రలోకి జారుకుంది.

ఉదయం లేచే సరికి ఆరు గంటల యింది.

పక్కింటి ప్లీడరు గుమాస్తా దీనదయాళ్‌గారు నాన్నగారితో ఏదో మాట్లాడుతున్నారు. అమ్మకూడా పక్కనే నిలబడి వుంది. 'కుర్రవాడు చాల బుద్ధి మంతుడమ్మా- కాకపోతే రెండో వివాహం.

నాలుగునెలల క్రితమే అతని భార్య స్కూటర్ ఏక్సిడెంటులో చనిపోయింది.

పిల్లా పాపాలేరు- ఆస్తి పాస్తులకేం కొదవలేదు- మీరు 'ఊ' అంటే పిల్లను చూడడానికి వస్తాన్నారు. పిల్ల నచ్చితే కానీ కట్నం ఇవ్వనక్కరలేదు. పిల్ల ఒకటో నంబరుగా వుంటుందని చెప్పాను" అంటూ నశ్యం డబ్బా తీశారు దీనదయాళ్ గారు.

వడ్డీ లేకుండా 1000 కోట్లు విదేశీ ఋణం దొరికినంత సంబరపడిపోయారు అమ్మా-నాన్న ఆ మాటలకు.


అమ్మ మాత్రం 'అమ్మాయితో ఒక మాట చెపుదాం' అంది.

'ఇందులో చెప్పేదేముందమ్మా. ఆ నాయకుడు

కూడా అర్థ లక్ష లేనిదే పిల్ల మెడలో తాళి కట్టటానికి ఇష్టపడని ఈ రోజుల్లో ఇలాంటి సంబంధం దొర కడం మాటలు కాదు. ఏదో విధివ్రకించి మనకు అవకాశం వచ్చింది. లేకపోతే వాళ్ళ కాంపౌండు గోడ దగ్గరకు కూడ వెళ్ళే అవకాశం మనకు లేదు. అమ్మాయి పెళ్లి గురించి బాధ పడుతున్నారు కాబట్టి చెప్పాను. తరువాత మీ ఇష్టం" అంటూ ఒక పట్టు వస్త్రం పట్టారు బాబాయిగారు. సుజాత ఈ మాట లన్నీ వింటూనే వుంది.

ఒక్క సారి తను పని చేసే ఆఫీసు కళ్ళ ముందు మెదిలింది.

దుశ్శాసనులు లాగా తనను వెంటాడే ఆఫీసర్, హెడ్ క్లార్క్, తోటి గుమాస్తాలు కనుపించారు. మరుక్షణంలో భర్త వేధింపులతో అత్త ఆడబిడ్డల సాధింపులతో సతమతమయ్యే తోటి గుమాస్త్రా రాధ గుర్తుకు వచ్చింది.



"సుజాతా! నీకు పెళ్ళి కాలేదన్నది ఒకటే బాధ- పెళ్ళయినేనేం సుఖపడుతున్నాను చెప్పు- ఇంటికి వెళ్ళా లంటేనే భయం. ముందుగా కట్నం వద్దని చెప్పి పెళ్ళి చేసుకున్నారు.

ఇప్పుడు అవి పెట్టలేదనీ, ఇవి తేలేదనీ రోజూ ఇంట్లో జాతరే. ఆయన కూడ అర్థం చేసుకోడు- అమ్మ, అక్కల మాటే విని రోజూ ఏదో వంకతో నన్ను చితకబాదుతుంటారు.

ఒక రకంగా చెప్పాలంటే నువ్వు చాల అదృష్ట వంతురాలివి" అనేది.

తనకు కూడ రాధలా జరిగితే? సుజాత వొళ్ళు కంపించింది.

తన పరిస్థితి అగమ్యగోచరంగా కనుపించింది., ముందుకు వెడితే నుయ్యి, వెనక్కు వెడితే గొయ్యి!

"నువ్వెక్కడ వున్నావు? పక్కింటి బాబాయిగారు ఒక సంబంధం తెచ్చారమ్మా" అంటు తల్లి సుజాత దగ్గరకు వచ్చింది.

"నేనంతా విన్నానమ్మా" అంటూ ముక్త సరిగా సమాధాన మిచ్చింది సుజాత.

"నాన్నగారు ఇప్పటి వరకూ ఎన్నో సంబంధాలు చూశారు. ఏదీ అనుకూలించలేదు. ఇంకా ఆయనకు తిరిగే ఓపిక కూడా లేదు. కనీసం ఇదైనా ఖాయమైతే మా బాధ్యత తీరుతుంది. .

ఏమంటావమ్మా!' తల్లి దీనంగా సుజాత వంక చూపింది. ఆ చూపులు సుజాతను ఉక్కిరి బిక్కిరి చేశాయి.

ఖర్మ ఎలా వుంటే అలా జరుతుంది. అమ్మ నన్ను నొప్పించకూడదు.

అమ్మ జీవితంలో ఏ నాడూ సుఖపడి ఎరుగదు.

అందుకే!

తానేమై పోయినా అమ్మను సుఖపెట్టాలి. సంతోషపెట్టాలి.

అదే తన ధ్యేయం. అదే తన నిర్ణయం.

"నీ ఇష్టం అమ్మా" అంది సుజాత.

ఈ మాటలకు తల్లి ఆనందంతో కళ్ళనీళ్ళు పెట్టు కొంది.

"నాకు తెలుసమ్మా- నువ్వు నా మాట కాదనవు- నీ నెత్తిన నాలుగు పసుపు గింజలు పడి పచ్చగా పిల్లా పాపలతో, కాపురం చేస్తుంటే చూసి కన్ను మూయ్యడం కన్నా ఈ పేద రాలు కోరుకునేదేం లేదమ్మా- ఈ జన్మకు నాకిది చాలు" అంటూ తల్లి బాబాయి గారితో

"బాబుగారూ! వాళ్ళకు పెళ్లి చూపులకు రమ్మని రాయండి. మీ చేతి చలవన దాని పెళ్ళయితే మీకు ఆజన్మం ఋణపడి వుంటాం" అంటూ చీర కొంగుతో కళ్ళు తుడుచుకొంది.

"ఎందుకమ్మా ఉత్తరాలు రాయడం? మధ్యాహ్నం మా ఆఫీసు నుంచి ఫోను చేస్తాను" అన్నారు దీనదయాళ్ బాబాయిగారు.

ఆ రోజంతా ఇంట్లో అంతా ఆనందంగా వున్నారు. ఆదివారం కాబట్టి సుజాత ఇంట్లోనే వుంది.

మధ్యాహ్నం ఎప్పుడవుతుందా అని బాబాయిగారి ఇంటి వైపు అన్నపూర్ణమ్మగారు ఎదురు చూడనారంభించింది.

సరిగ్గా మూడు గంటలకు ఆయన వచ్చారు.

"వచ్చే ఆదివారం వస్తానన్నారమ్మా- ఉదయం 11 గంటలకు పాలకొల్లు నుంచి బస్సు వస్తుందట. దానిలో వస్తామన్నారు. ఆ రోజు నేను వుండను. 10-30 కల్లా అన్నయ్యగారిని బస్టాండుకు వెళ్ళి తీసుకురమ్మనండి" అంటూ పెళ్ళి వారి అడ్రసు, వివరాలు ఇచ్చాడు. దీనదయాళ్ గారు.

"పిల్ల వచ్చితే ఉద్యోగం కూడ చెయ్యనక్కరలేదట" ఆయనే అన్నారు.

సుజాత ఆనందానికి అవధులు లేవు. అంతకన్నా తానుకోరుకునేదేముంది?

పెళ్ళి చూపుల విషయం అంతా ఖాయమయ్యే వరకూ ఎవరికీ చెప్పవద్దని భర్తకూ, కూతురుకూ చెప్పింది అన్నపూర్ణమ్మ. వచ్చే చుట్టాలకు ఏం పిండి వంటలు చెయ్యాలి? ఎలా మర్యాదలు చెయ్యాలన్న విషయాల మీద దృష్టిని కేంద్రీకరించింది. అన్నపూర్ణమ్మ.

సుజాత మాత్రం ఏం చీర కట్టుకోవాలి అన్న ఆలోచనలతో కాలం గడిపింది. ఆఫీసు మాత్రం మానలేదు.

కాలగమనం ఎవరి కోసం ఆగదు-

అనుకున్న ఆదివారం రానే వచ్చింది - అన్నపూర్ణమ్మ ఆదుర్దాకు అంతులేదు - పెళ్ళివారికి తానే స్వయంగా నేతితో పిండి వంటలు చేసింది - ఇల్లంతా అద్దంలా సర్దింది -

భర్తను 10-20 కల్లా బస్టాండ్‌కు పంపింది - ఈ ప్రయత్నం ఫలిస్తే కొండకు వచ్చి తల నీలాలిస్తానని ఏడుకొండల వాడికి మొక్కుకుంది అన్నపూర్ణమ్మ -

సుజాత తలంటు పోసుకుంది - కనకాంబరం రంగు చీర కట్టుకుంది - దానికి మేచింగ్ జాకెట్ వేసుకుంది - సహజంగానే అందంగా వుండే సుజాత ఆ దుస్తులతో మరింత మెరిసిపోతోంది - ఆ జన్మ బ్రహ్మచారిగా వుందామని శపథం చేసిన వారు కూడా ఇప్పుడు ఆమెను చూస్తే ఒట్టు తీసి గట్టున పెట్టవలసిందే -

"పూలు పెట్టుకోలేదేమ్మా" అంది అన్నపూర్ణమ్మ-

"ఇప్పుడవి లేకపోతే ఏమయిందిలే అమ్మా!" అంది సుజాత.

"ఇప్పుడు నువ్వు తల్లో కనకాంబరం పూలు పెట్టుకుంటే ఎంతో బాగుంటుంది" తెస్తా నుండమ్మా" అంటూ కూతురు మాట వినకుండా బజారుకు బయలుదేరింది అన్నపూర్ణమ్మ-

ఎక్కడ చూసినా కనకాంబరాలు దొరకలేదు - ఎవరో "బస్టాండులో వున్నయమ్మా"అని సలహా ఇచ్చారు - కూతురు నిండుగా కనుపించాలి అదే ఆమె ధ్యేయం-

వెంటనే బస్టాండుకు బయలుదేరింది - తీరా బయలుదేరాక అనుకొంది పెళ్ళి వారు కూడా అక్కడే దిగుతారు కదా అని -

ఇదీ ఒకందుకు మంచిదే - ముందుగానే కాబోయే అల్లుణ్ణి చూడవచ్చు - నాలుగడుగుల్లో బస్టాండు చేరుకుంది -

బేరమాడి పది మూరల కనకాంబరాలు తీసుకుంది -

అప్పుడే పాలకొల్లు నుంచి వచ్చే బస్సు వచ్చి ఆగింది - తన భర్త బస్సును సమీపిస్తున్నాడు - ప్రయాణీకులు బస్సు నుండి ఒక్కొక్కరే తోసుకుంటూ దిగుతున్నారు - కుర్రవాడు ఎప్పుడు దిగుతాడా చూద్దామన్న ఆశ అన్నపూర్ణలో ఎక్కువైంది - ఆఖరికి ఒక కుర్రవాడు, ఇద్దరమ్మాయిలు దిగారు - ముగ్గురూ చూడ ముచ్చటగా ఉన్నారు. అతనేనా కుర్రవాడు? అన్నపూర్ణమ్మకు అనుమానం వచ్చింది - వాళ్ళు ఎవరికోసమో ఎదురు చూస్తూ అన్నమయ్యగారితో మాట్లాడుతున్నారు - అన్నపూర్ణమ్మగారు వడివడిగా ఇంటి దారి పట్టింది.

"ఇంత ఆలస్యం అయిందేమమ్మా?" అడిగింది సుజాత.

"పూలు ఎక్కడా దొరకలేదమ్మా - ఆఖరికి బస్టాండుకు వెళ్ళి తెచ్చానమ్మ" అంటూ పూలదండ తీసి కూతురు తలమీద అలంకరించి తృప్తిగా కూతురు వంక చూసుకుంది." ఇక నువ్వు వెళ్ళి లోపల కూర్చో అమ్మా - వాళ్ళు వచ్చే టైం అయింది" అంది అన్నపూర్ణమ్మ - వీధి గుమ్మం చప్పుడైంది.

పవిటచెంగు మెడపైగా తిప్పుకొంటూ అన్నపూర్ణమ్మ తలుపు తీసింది.

ఎదురుగా భర్త మాత్రం ఉన్నాడు - అన్నపూర్ణగారు స్తంభించిపోయింది-

"వాళ్ళేరీ!" అడిగింది -

"రాలేదు" భర్త సమాధానం-

"ఇందాక బస్టాండులో మీతో మాట్లాడిన అబ్బాయి, ఇద్దరమ్మాయిలు" అంటూ నసిగింది-

"వాళ్ళు మనింటికి వచ్చిన వాళ్ళు కాదు" చెప్పాడు భర్త.

ఈ మాటలకు షాక్ తిన్నారు సుజాత, అన్నపూర్ణమ్మలు.

సుజాత మాత్రం మరుక్షణంలో తేరుకుని ఇది మామూలు కథే అనుకుంది - కొత్త బట్టలు విప్పి మామూలు బట్టలు వేసుకుంది - ఏదో మేగజైన్ తీసుకొని చదువుకో నారంభించింది - అన్నపూర్ణమ్మ మాత్రం కళ్ళనీళ్ళు పెట్టుకొంది.


వారం నుంచి కట్టుకున్న గాలి మేడలు కూలిపోయాయి. వాళ్ళు ఎందుకు రాలేదో ఆమెకు అర్థం కాలేదు -

కనీసం బాబాయిగారున్నా ఫోను చేసి విషయం తెలుసుకునే వారనుకుంది అన్నపూర్ణమ్మ-

ఎంత సర్దుకు పోదామనుకున్నా మనసు వుండబట్టడం లేదు-

కన్నీరు ఏకధారగా కారుతున్నాయి-

"ప్రతి దానికీ నువ్వు ఎందుకు బాధ పడతావు? జరిగినప్పుడే జరుగుతుంది - ఇప్పుడేం కొంప మునిగింది" అంటూ అన్నమయ్యగారు బయట పనుందని వెళ్ళిపోయాడు-



ఆయనకేం? మగాడు - సర్దుకు పోగలడు -

నిలబడాలన్నా ఇప్పుడామెకు శక్తి లేదు. వెళ్ళి మంచం మీద తలవాల్చింది-

గంట గడిచి పోయింది.

తలుపు చప్పుడయింది.

సుజాత వెళ్ళి తలుపు తీసింది.

ఎదురుగా ఇద్దరమ్మాయిలూ - ఒక అబ్బాయీ నిలబడి వున్నారు.

ఆ అమ్మాయిలను ఎక్కడో చూసినట్టుంది సుజాతకు -

వాళ్ళే "సుజాతా! బాగున్నావా?" అని పలకరించారు-

వెంటనే సుజాతకు గుర్తువచ్చింది - వాళ్ళు హైస్కూలులో తనతో పాటు చదువుకున్న 'వాణి - రాణి' అని. వాళ్ళిద్దరూ కవల పిల్లలు. వెంటనే సాదరంగా లోపికి ఆహ్వానించింది.

"ఇతను మా తమ్ముడు మురళి ఎం.బి.బి.ఎస్. చదువుతున్నాడు" అని సుజాతకు పరిచయం చేశారు.

ఆ మాటలకు అన్నపూర్ణమ్మగారు బయట హాలులోకి వచ్చింది.

వాళ్ళను చూసి ఆశ్చర్యపోయింది - ఇందాక తాను బస్టుస్టాండులో చూసింది వీళ్ళనే - అన్నపూర్ణమ్మగారికంతా అయోమయంగా వుంది - భర్త పెళ్ళిచూపులకు ఎవరూ రాలేదని చెప్పారు. మరి వీళ్ళు ఎక్కడికి ఎందుకు వచ్చినట్టు?

సుజాత తల్లిని స్నేహితురాళ్ళకు పరిచయం చేసింది - స్నేహితురాళ్ళు ఒక్కసారి హైస్కూలు రోజులు నెమరువేసుకున్నారు.

ఇంతలో అన్నపూర్ణమ్మ పెళ్ళివారికని చేసిన పిండి వంటలు తెచ్చి పెట్టింది - కులాసాగా మాట్లాడుకొంటూ విందారగించారు అంతా - మాటల మధ్యలో వాణి - రాణి అన్నదమ్ములనే పెండ్లి చేసుకొని అమెరికాలో వుంటున్నట్టుగా తెలుసుకొంది సుజాత.

అన్నపూర్ణమ్మ మాత్రం వాళ్ళేదైనా శుభవార్త చెబుతారేమోనని ఎదురు చూస్తోంది-

"సుజీ! ఇలా మేం అకస్మాత్తుగా మీ ఇంటికి వస్తామని నువ్వు ఊహించి వుండవు కదూ!" అంది వాణి-

సుజాత అవునన్నట్టు తలూపింది-

"మాకు ఒక అన్న, ఒక తమ్ముడు. నాలుగు నెలల క్రితం దురదృష్టం కొద్దీ మా వదిన ఏక్సిడెంట్‌లో చనిపోయింది. అన్నయ్యససేమిరా పెళ్ళి చేసుకోనన్నాడు - మేమంతా బలవంత పెట్టాం - అన్నయ్యను సుఖపెట్టాలంటే కట్న కానుకలు లేకపోయినా ఒక సంస్కారవంతమైన అమ్మాయి కావాలనుకొన్నాం - దీనదయాళ్ అంకుల్ మా కుటుంబానికి ఎంతో ఆత్మీయులు - మా తండ్రిగారికి ప్రాణ స్నేహితులు - ఆయన నీ గురించి చెప్పాడు - నీ ఫోటో చూపించాడు. మేమిద్దరం ఎగిరి గంతేశాం - అన్నయ్యకు నీ గురించి చెప్పాం. దీనదయాళ్ అంకుల్ 'అమ్మాయి గురించి చెడుగా ఉత్తరాలు రావచ్చు - నమ్మకండి' అన్నాడు. అలాగే ఈ వారం రోజులలో నీ గురించి చెడుగా నాలుగు ఉత్తరాలు వచ్చినయ్.

'మీరు పెళ్ళి చూపులకు దిగిన తరువాత కూడా మీకు అమ్మాయి గురించి ఎవరైనా చెడుగా చెప్పి, తిరిగి వెళ్ళిపొమ్మని చెప్పవచ్చు' అన్నాడు.

ఆయన చెప్పినట్టుగానే అది కూడా జరిగింది.

చిన్నప్పటి నుంచి కలిసి చదువుకున్నాం- డబ్బు లేకపోయినా నీ సంస్కారమేమిటో మాకు తెలుసు. అన్నయ్య నిన్న వారం రోజుల నాడే చూశాడు - నువ్వు నచ్చావ్ - కనుక మేం యిప్పుడు వచ్చింది పెళ్ళి చూపులకు కాదు - ఏకంగా పెళ్ళికే - ఈ రోజురాత్రికే వెంకటేశ్వరుని సాన్నిధ్యంలో పెళ్ళి - మా స్నేహితురాలే మా ఇంట్లో మా వదినగా అడుగు పెడుతోందంటే మాకెంత ఆనందంగా వుందో తెలుసా?" అంది వాణి.

అన్నపూర్ణమ్మ ఆనందంతో ఉబ్బి తబ్బిబ్బయింది-

సుజాత ఒక్కసారి వాణిని కౌగలించుకొని కన్నీరు కార్చింది -

ఇంతలో ఇంటి ముందు కారు వచ్చి ఆగింది -

దీనదయాళ్‌గారు, ఆరడుగుల అందగాడు వెంటరాగా లోనికి వచ్చారు. వాణి, అన్నను సుజాతకు పరిచయం చేసింది.

సుజాత వచ్చిన ఇద్దరికీ పాదాభివందన ంచేసింది-

అన్నపూర్ణమ్మ "మీ ఋణం తీర్చుకోలేం బాబూ" అంటూ దీనదయాళ్‌గారికి చేతులు జోడించింది.

"చూడమ్మా! ఇన్నేళ్ళ నా అనుభవంలో కట్నం కోసం రాచి రంపాన బెట్టిన అత్తమామల్ని చూశాను - లాంఛనాలు తేలేదని భార్యను చిత్రహింసలు పెట్టిన భర్తల్ని చూశాను -

కానీ కన్నకూతురు పెళ్ళి చేస్తే ఆమె తెచ్చే సంపాదన పోతుందని కన్నబిడ్డనే నీచంగా చిత్రించి, వచ్చిన సంబంధాలు చెడగొట్టే మహానీయుడ్ని మీ ఆయన్నే చూశాను - అందుకే నేను అనుమానించేది నిజమని తెలుసుకొనేందుకు హైదరాబాద్ వెడతానని నాటకం ఆడాను - ఈ నమ్మలేని నిజాన్ని తెలుసుకున్నాను. వాణి - రాణి, సుజాత స్నేహితురాళ్ళు కాబట్టి ఈ కార్యం ఇంత తేలికగా ముగిసింది" అన్నారు.

ఇది విన్న వారంతా ఇది నిజంగా "నమ్మలేని నిజమే" అన్నారు.

ఆ రాత్రికి వెంకటేశ్వరస్వామి సాన్నిధ్యంలో సుజాత పెళ్ళి రంగ రంగ వైభవంగా జరిగింది - అది విన్న ఆఫీసరు, హెడ్ క్లార్క్, తోటి గుమాస్తాలు, సిటీ బస్సు రోమియోలు, వీధి రోమియోలు ఇది నమ్మలేని నిజం అనుకున్నారు.

